# పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- మధిర, మోటమర్రి రైల్వే స్టేషన్లను పరిశీలించిన డీఆర్ఎం భర్తేశ్‌కుమార్ జైన్

మధిర/బోనకల్లు, డిసెంబర్ 19 : అమృత్ భారత్ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్‌కుమార్ జైన్ ఆదేశించారు. గురువారం ఆయన ప్రత్యేక రైలులో విజయవాడ నుంచి మధిరకు చేరుకున్నారు. రూ.26 కోట్ల వ్యయంతో చేపట్టిన రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పాత గేటు సమీపంలోని సిగ్నల్ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ట్రాలీపై వెళ్లి ట్రాక్ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మోటమర్రి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బోనకల్లుకు చెందిన బాజీబాబా పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ మధిర, బోనకల్లుతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో అండర్ బ్రిడ్జి నిర్మాణాల కోసం ప్రతిపాదనలు ఇప్పటికే రైల్వే బోర్డుకు పంపించామని, త్వరలోనే అవి మంజూరవుతాయని వివరించారు.



మధిర రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం భర్తేశ్‌కుమార్ జైన్

# ప్రైవేటు హాళ్లకు దీటుగా రామదాసు కళాక్షేత్రం

## ఆధునీకరణకు డీపీఆర్ తయారు చేయాలి : కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



భక్త రామదాసు కళా క్షేత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, డిసెంబర్ 19 : ప్రైవేటు హాళ్లకు దీటుగా ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరిస్తామని, ఇందుకోసం డీపీఆర్ తయారు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రాన్ని గురువారం సందర్శించిన కలెక్టర్.. ప్రూఫ్ లీకేజీ మరమ్మతు, ఎంట్రీ కలర్ వాష్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలు, కళాకారులకు పుట్టినిల్లు అయిన ఖమ్మం జిల్లా కేంద్రంలో ఉన్న భక్త రామదాసు కళాక్షేత్రంలో ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగుపర్చడం, డయాస్, పూర్తిస్థాయిలో లైటింగ్, వాల్ పెయింటింగ్, సీటింగ్ అరెంజ్‌మెంట్స్, ఆవరణలో గ్రీనరీ కోసం హైదరాబాద్ నుంచి ఆర్కిటెక్చర్‌ను పిలిపించి డిజైన్ రూపొందించి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో దీక్షా రైనా, డిప్యూటీ ఇంజినీర్ మహేశ్‌బాబు, సంబంధిత అధికారులు ఉన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు రిజెక్ట్


- చెక్కుల కాలం ముగియడంతో లబ్ధిదారుల ఆందోళన
- తిరిగి చెక్కులు తెప్పించి ఇస్తామని చెప్పిన అధికారులు



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 19 : అధికారుల నిర్లక్ష్యం వల్ల కళ్యాణలక్ష్మి చెక్కులు రిజెక్ట్ కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ రిజెక్ట్ కాని చెక్కులు ఇప్పుడు రిజెక్ట్ కావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గత సీఎం కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా వివాహం చేసుకున్న వధువులకు మేనమామగా రూ.1,00,116 ప్రభుత్వం తరపున అందిస్తూ.. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అనే పథకాన్ని ప్రవేశపెట్టి అండగా నిలిచారు. ఈ పథకంలో గతంలో వేలాది మంది వధువులు సత్తుపల్లి నియోజకవర్గంలో లబ్ధిపొందారు. అయితే గత ఏడాది వివాహం చేసుకొన్న వారు కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. సత్తుపల్లి మండలం నుంచి దరఖాస్తు చేసుకున్న 13 మందికి ఈ ఏడాది సెప్టెంబర్ 19న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. వీటిని సంబంధిత రెవెన్యూ కార్యాలయాలకు పంపించినప్పటికీ వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందించలేదు. వాస్తవానికి ఈ చెక్కులు మంజూరైన మూడు నెలలకు.. మూడు రోజుల ముందుగా లబ్ధిదారులు తమ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు నిర్లక్ష్యంతో అందించకపోగా.. గురువారం మధ్యాహ్నం హడావిడిగా సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాటిని పంపిణీ చేశారు. వెంటనే ఖాతాల్లో జమ చేసుకోవాలని అధికారులు చెప్పడంతో 13 మంది లబ్ధిదారులు బ్యాంకు వద్దకు వెళ్లారు. దీంతో బ్యాంకు అధికారులు చెక్కుల సమయ కాలం ముగిసిందని చెప్పడంతో లబ్ధిదారులు నిరాశతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. దీనిపై సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వరరావును వివరణ కోరగా.. సెప్టెంబర్ 19న చెక్కులు మంజూరైనప్పటికీ తమకు రావడంలో జాప్యం జరిగిందని, తమకు అందిన వెంటనే చెక్కులు లబ్ధిదారులకు అందించామని పొంతన లేని వివరణ ఇచ్చారు. ఈ విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తిరిగి చెక్కులు తెప్పించి ఇప్పిస్తామని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ చెక్కుల పంపిణీలో జాప్యం జరిగిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

- పేదలూ పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న కేసీఆర్ సంకల్పానికి సమాధి
- ఆయా పండుగలు, పబ్బాలకు ప్రభుత్వం పంపే కానుకలు, తోఫాలకు మంగళం
- ఇప్పటికే దసరాకు బతుకమ్మ చీరలు, రంజాన్‌కు తోఫాలను బంద్ చేసిన ప్రభుత్వం
- తాజాగా క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లపైనా స్పష్టత కరువు.. స్వస్తి పలికినట్లుగానే సుస్పష్టం
- నిరుపేదలు పండుగ పూట సంతోషంగా ఉండకూడదన్నట్లుగా రేవంత్ సర్కారు తీరు
- కేసీఆర్‌పై అక్కసుతోనే 'కానుకల నిలుపుదల'పై నిరుపేదల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం
- సమైక్య పాలనను గుర్తుకు తెస్తున్నారంటూ కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోస్తున్న వైనం



# కానుకలు కట్

ఖమ్మం, డిసెంబర్ 19:
సర్వమత సమానత్వానికి, సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలమైన తెలంగాణలో పండుగల వేళ నిరుపేదలూ సంతోషంగా ఉండాలని, ఉన్నత వర్గాల ప్రజలతోపాటు పేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలని గత కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు అనుగుణంగానే అన్ని పండుగలకూ ఆయా మతాల ప్రజలకు కానుకలు అందిస్తూ వచ్చింది. తెలంగాణ సాంస్కృతిక వేడుకైన బతుకమ్మ పండుగకు 18 ఏళ్లు నిండిన అన్ని మతాల మహిళలకూ బతుకమ్మ చీరలనూ అందిస్తూ వచ్చింది. భిన్న రకాల డిజైన్లతో తెలంగాణ చేనేత కార్మికులు తయారు చేసిన బతుకమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేసేది. ఈ చీరలకు రాష్ట్ర ఆడబిడ్డల నుంచి అపూర్వ ఆదరణ లభించేది. వాటిని అందుకున్న ఆడబిడ్డలు ఎంతగానో మురిసిపోయేవారు. వాటిని అందుకునేందుకు ఎంతో ఓపికగా బారులుతీరేవారు. ప్రభుత్వం పంపిన బతుకమ్మ చీరలు ధరించి తెలంగాణ సంస్కృతికి రూపమైన బతుకమ్మల వద్ద ఆడిపాడేవారు. అంతే సంతోషంగా తొమ్మిదో రోజున సాగనంపేవారు. అంతటి ఆదరణ పొందిన బతుకమ్మ చీరలకు ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కారు మంగళం పాడింది. దీంతో ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాల్లో ఆడబిడ్డలందరూ అసంతృప్తిగానే పాల్గొన్నారు. తెలంగాణ జీవనాడి అయిన బతుకమ్మకు ఆదరణ తగ్గించడాన్ని, ఇటీవల తెలంగాణ తల్లి నూతన విగ్రహం చేతిలో బతుకమ్మను తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సమైక్య పాలనను గుర్తుకు తెస్తున్నారంటూ రేవంత్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.



కరోనా సమయంలోనూ బతుకమ్మ చీరలు అందుకొని మురిసిపోతున్న మహిళలు (ఫైల్)

### బతుకమ్మకు చీరలు బంద్..

సమైక్య రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన బతుకమ్మకు తెలంగాణను తెచ్చిన కేసీఆర్ పూర్వ వైభవం కల్పించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను రాష్ట్ర ప్రజలందరూ గౌరవించుకునేలా వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు తెలంగాణ ఆడబిడ్డలందరూ సంతోషంగా బతుకమ్మలు ఆడేలా ఏర్పాట్లు చేసి వసతులు కల్పించేవారు. మధ్యాహ్నం తరువాత వెళ్లి బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా మహిళా ఉద్యోగులకు వెసులుబాటు కల్పించేవారు. కుల, మత తారతమ్యాలు లేకుండా 18 ఏళ్లు నిండి రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఆడబిడ్డకూ పండుగకు పది, పదిహేను రోజుల ముందుగానే బతుకమ్మ చీరలు పంపిణీ చేసేవారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత మొదలైన ఈ బతుకమ్మ చీరల పంపిణీ నిరుటి వరకూ నిరాటంకంగా కొనసాగింది. రకరకాల రంగులు, నాణ్యమైన చీరలు అందుకున్న ఆడబిడ్డలు వాటిని ధరించి సంతోషంగా బతుకమ్మలు ఆడేవారు. ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షలకు పైగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తూ వచ్చింది గత కేసీఆర్ ప్రభుత్వం. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రేషన్ డీలర్ల ద్వారా వీటిని పంపిణీ చేసేది. కానీ.. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఈ ఏడాది బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేసింది. అధికారికంగా నిర్వహించాల్సిన బతుకమ్మ వేడుకలకు మంగళం పాడింది. వైభవాలను పక్కనబెట్టి తూతూమంత్రంగా మమ అనిపించింది.



'తెలంగాణలో పండుగల వేళ ఏ ఒక్కరూ పస్తులుండే పరిస్థితి ఉండకూడదు. ఆ రోజున ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదనే కారణంతో పండుగకు కొత్త బట్టలు లేవన్న బాధ ఉండకూడదు. కుల, మత ఆచారాలకు అతీతంగా ఆయా పండుగలకు ప్రభుత్వమే కొత్త దుస్తులు అందిస్తుంది. దసరా వేళ ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు, రంజాన్ కోసం ముస్లింలకు రంజాన్ తోఫాలు, క్రిస్మస్‌కు క్రైస్తవుల కోసం క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌లు అందిస్తాం. మత సామరస్యాన్ని చాటుతాం. నిరుపేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం.'

–గతంలో పలు ప్రభుత్వ కానుకల పంపిణీ సభల్లో కేసీఆర్

### కేసీఆర్‌కు పేరొచ్చిందనే అక్కసుతోనే..



తెలంగాణలో మత సామరస్యానికి పెద్దపీట వేయడం, అన్ని పండుగలకూ ఆయా కులమతాల్లోని నిరుపేదలకు ప్రభుత్వమే కానుకలు అందజేయడం వంటి కారణాల వల్ల గత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంతో మంచి పేరు వచ్చింది. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు, క్రిస్మస్ కానుకలు అందుకున్న ప్రజల నుంచి కేసీఆర్‌కు అత్యంత ఆదరణ వచ్చింది. పండుగలకు కానుకలంటేనే ప్రజలకు కేసీఆర్ గుర్తుకొస్తారు. ఈ కానుకల వల్ల కేసీఆర్‌కు ఇంతటి పేరు వచ్చిందన్న అక్కసుతోనే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయా కానుకల పంపిణీలకు మంగళం పాడింది. కేసీఆర్ పేరు లేకుండా చేయాలన్న దురుద్దేశంతోనే పథకాలను నిలిపివేస్తోంది.

–తాతా మధు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

### ఇఫ్తార్ విందుల్లేవు.. రంజాన్ తోఫాల్లేవు..

ముస్లింల అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిచ్చింది. రంజాన్ మాసం కొనసాగినన్నాళ్లూ అధికారికంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసేది. రంజాన్ తోఫాలకైతే అపూర్వ ఆదరణ లభించేది. ఆ రంజాన్ తోఫాల కిట్‌లో సేమ్యాలతోపాటు ఇంటి పెద్దలకు లాల్చీపైజామా చీర, జాకెట్; పిల్లలకు పంజాబీ డ్రెస్ మెటీరియల్, ప్యాంటు షర్టు వంటివి ఉచితంగా పంపిణీ చేసేది. వాటిని అందుకున్న నిరుపేద ముస్లిం కుటుంబాలు ఎంతగానో మురిసిపోయేవి. పండుగను ఎంతో సంతోషంగా జరుపుకునేవి. ఖమ్మం నియోజకవర్గానికి 2,500, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలకు 1,500 చొప్పున ఖమ్మం జిల్లావ్యాప్తంగా 8,500 రంజాన్ తోఫాలను ప్రభుత్వం పంపేది. కానీ.. ఏడాది క్రితం తెలంగాణలో పాలనా పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రంజాన్ తోఫాలను పూర్తిగా నిలిపివేసింది.

### క్రిస్మస్ కానుకలు లేనట్లే..

రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరలను, రంజాన్ తోఫాలను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదు రోజుల్లో రాబోయే క్రిస్మస్ కానుకలకూ మంగళం పాడింది. క్రైస్తవులకు ఎంతో ప్రీతిపాత్రమైన క్రిస్మస్ పండుగకు రెండు వారాల ముందుగానే గత కేసీఆర్ ప్రభుత్వం నిరుపేద క్రైస్తవులకు క్రిస్మస్ కానుకల కిట్లను పంపిణీ చేసేది. నియోజకవర్గానికి వెయ్యి చొప్పున ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఐదు వేల కానుకలను అందించేది. ఈ గిఫ్ట్ ప్యాక్‌లో ఒక చీర, పంజాబీ డ్రెస్, ప్యాంట్, షర్టు ఉండేవి. కుటుంబంలోని తల్లిదండ్రులకు, కుమార్తెకు దుస్తులు అందించేది. కానీ.. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటివరకు క్రిస్మస్ కానుకల పంపిణీపై అధికారులకు కూడా ఎలాంటి సమాచారమూ లేదు. దీంతో వీటిని నిలిసివేసినట్లు స్పష్టమవుతోంది.

## రాజకీయ కక్ష సాధింపుతోనే కేటీఆర్‌పై అక్రమ కేసు

### కుట్రల వల్ల బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: తాతా



ఖమ్మం, డిసెంబర్ 19: ఫార్ములా ఈ–కార్ రేసింగ్‌లో అవకతవకలకు పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ కక్షలో భాగంగానే ప్రస్తుత పాలకులు కేటీఆర్‌పై కేసు నమోదు చేయించారని అన్నారు. ఇలాంటి కుట్రలు, కేసుల వల్ల బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయలేరని స్పష్టంచేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు సాగిస్తున్న పోరాటాలకు భయపడే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి కేసులతో వేధించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఫార్ములా ఈ–కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చకు సవాలు విసిరిన కేసీఆర్‌కు సమాధానం చెప్పలేక పలాయనం చిత్తగించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇలా అక్రమ కేసుకు పూనుకుందని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో జైలు జీవితం గడిపిన రేవంత్‌రెడ్డి.. అందుకు ప్రతీకారంగానే కేటీఆర్‌పై అక్రమ కేసుకు తెరలేపారని ధ్వజమెత్తారు.

## ట్యాలీ ఆపరేటర్, అకౌంటెంట్ లేక మూడు నెలలు

### సిబ్బంది కావాలంటూ తీరిగ్గా నివేదించిన విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 19: పాఠశాలల నిర్వహణకు కేటాయించిన నిధుల జమ, వినియోగం వివరాల సేకరణ వంటి కీలకమైన విభాగాల్లో పనిచేయాల్సిన సిబ్బంది లేక మూడు నెలలు కావస్తోంది. ఈ విభాగం ద్వారానే ఇటీవల సుమారు రూ.2 కోట్ల పాఠశాలల నిధులు దారి మళ్లిన విషయం విదితమే. విద్యాశాఖ పరిధిలోని సమగ్రశిక్షా అభియాన్‌లో ఫైనాన్స్ విభాగంలో ఒప్పంద పద్ధతిన నియమించిన అకౌంటెంట్, ట్యాలీ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరిలో ఒకరు మృతిచెందగా.. మరొకరు విధులకు గైర్హాజరవుతున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచాల్సిన విద్యాశాఖాధికారులు తీరిగ్గా ఇప్పుడు సిబ్బంది కావాలంటూ ఉన్నతాధికారులకు నివేదించారు.

**అనర్హులకు కేటాయింపు..**

ఫైనాన్స్ విభాగంలో పనిచేయాల్సిన అకౌంటెంట్, ట్యాలీ ఆపరేటర్ లేకపోవడంతో విద్యాశాఖలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందిని కేటాయించారు. ఫైనాన్స్ పరిశీలించాల్సిన విషయంలో అర్హత లేని జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌కు విధులు అప్పగించారు. గతంలో అకౌంటెంట్‌గా పనిచేసిన ఉద్యోగి అనారోగ్యంతో మృతిచెందగా.. ట్యాలీ ఆపరేటర్‌గా చేసిన మహిళా ఉద్యోగి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇదే విభాగంలో పనిచేసేందుకు భద్రాద్రి జిల్లా నుంచి కేటాయించిన ఒప్పంద ఉద్యోగి కొన్ని రోజులు ఆ సెక్షన్ విధులు నిర్వర్తించగా.. రాష్ట్ర ఉన్నతాధికారులే నేరుగా ఆ పోస్టు నుంచి తొలగించి విద్యాశాఖలో కొనసాగించాలని ఉత్తర్వులిచ్చారు.

**పూర్తిస్థాయిలో చెల్లింపులు జరగలే..**

సుమారు రూ.2 కోట్ల విద్యాశాఖ నిధులు దారి మళ్లించిన ఘటన విద్యాశాఖను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఉన్నతాధికారులు ఈ అంశంపై శాఖాపరమైన విచారణతోపాటు విజిలెన్స్ విచారణ సైతం నిర్వహించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ విద్యాశాఖ అధికారితోపాటు ఫైనాన్స్ పర్యవేక్షణ అధికారికి షోకాజ్‌లు సైతం జారీ చేశారు. దీనిలో రెండు విడతల్లో రూ.1.10 కోట్లు వసూలు చేయగా.. మిగిలిన మొత్తాన్ని ఇంకా రికవరీ చేయాల్సి ఉంది. విధుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు తమ సంతకాలనే ఫోర్జరీ చేసినా గుర్తించలేకపోవడం, సంబంధిత సిబ్బంది కాంట్రాక్ట్ ఉద్యోగి కావడం, పర్యవేక్షణ లోపించడం వంటి కారణాలతోనే నిధులు దారి మళ్లినట్లు గుర్తించారు.

# వారబందీ ఖరారు!

- పాలేరు రిజర్వాయర్‌కు చేరుకున్న సాగర్ జలాలు
- జిల్లాలో 2.54 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు నీరు
- యాసంగి సాగుకు ఏప్రిల్ 23 వరకు నీరు విడుదల



సాగర్ ఎడమ కాల్వ నుంచి విడుదలైన నీరు



పెరికసింగారంలో సాగర్ కాల్వ కింద యాసంగి నాట్లు వేస్తున్న కూలీలు

కూసుమంచి, డిసెంబర్ 19 : సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగుకు నీటి విడుదల షెడ్యూల్‌ను నీటిపారుదల శాఖ అధికారులు ఖరారు చేశారు. వారబందీ పద్ధతిలో వారానికి ఒకసారి ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరు ఇవ్వాలని నిర్ణయించారు. అధికారికంగా ఆరుతడి పంటలకే నీరు అని ప్రకటిస్తున్నా.. సాగర్ ఆయకట్టు కింద ఉన్న 17 మండలాల్లో 2.54 లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జున సాగర్ నుంచి యాసంగి సాగు కోసం అధికారులు కృష్ణా జలాలను ఈ నెల 15న వదలడంతో మంగళవారం ఆ నీరు పాలేరు జలాశయానికి చేరింది. ఇప్పటికే నీటిని జిల్లాకు ఇస్తుండడంతో ఈసారి నీటి విడుదలను అధికారికంగా వదిలే అవకాశాలు లేవు. అయితే పాలేరు నీటిమట్టం 21 అడుగులకు తగ్గకుండా అధికారులు చర్యలు చేపట్టారు. వచ్చే ఏప్రిల్ 23 వరకు సాగునీరు ఇవ్వనున్నారు.

### వరి నాట్లకు సిద్ధమైన రైతులు

పాలేరు రిజర్వాయర్ నుంచి యాసంగి సాగుకు నీటిని విడుదల చేశారు. గత వానకాలం పూర్తిస్థాయిలో పంటలు పండగా.. యాసంగికి కూడా పూర్తి అయకట్టు రైతులు వరి నాట్లకు సిద్ధమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు వేయగా.. మరికొన్ని ప్రాంతాల్లో కరిగట్లు చేస్తున్నారు. సాగర్ నుంచి 4,328 క్యూసెక్కుల నీరు పాలేరు రిజర్వాయర్‌కు రావడంతో 14 అడుగులు ఉన్న నీటిమట్టం క్రమంగా పెరిగి గురువారం నాటికి 17 అడుగులకు చేరింది. దీంతో మిషన్ భగీరథకు 135 క్యూసెక్కులు, పాలేరు పాత కాల్వకు 150 క్యూసెక్కులు, భక్త రామదాసు ప్రాజెక్టుకు 275 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జిల్లాలోని కల్లూరు వరకు ప్రధాన కాల్వ కింద ఉన్న సాగర్ రెండో జోన్‌లోని రైతుల కోసం 3,382 క్యూసెక్కుల నీటిని వదుతున్నారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో మధ్య 380 క్యూసెక్కుల వ్యత్యాసం ఉండడంతో క్రమంగా పాలేరును పెంచాలని ఇరిగేషన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 18 అడుగులు ఉంది.

### ఏడు తడుల్లో నీటి విడుదల

సాగర్ ఎడమ కాల్వ కింద గల రెండో జోన్ ఖమ్మం జిల్లా రైతులకు వారబందీ పద్ధతిలో మాత్రమే నీటిని విడుదల చేయాలని హైదరాబాద్‌లో జరిగిన శివం సమావేశంలో అధికారులు నిర్ణయించారు. అయితే ఇప్పటికే విడుదలవుతున్న నీటిని యాసంగికి వాడుకోవాలని సూచించారు. ఒక వారం నీరు ఇచ్చి.. మరో వారం నీటిని నిలిపివేస్తారు. ఈ తరహాలో మొత్తం 7 దఫాలుగా నీరు ఇస్తారు. సుమారు వంద రోజులపాటు సాగర్ ఆయకట్టు కింద పంటలు చేతికొస్తాయనే ఆలోచనతో అధికారులు అంచనాలు ఇలా రూపొందించారు. సాగర్ మొదటి జోన్‌లో ఇచ్చిన షెడ్యూల్‌నే రెండో జోన్‌లో కూడా అమలు చేయనున్నారు.

### ముమ్మరంగా వ్యవసాయ పనులు

మళ్లీ వేసవిలో నీటి కొరత ఏర్పడుతుందనే ఆలోచనతో ఈసారి రైతులు యాసంగి ముందే సాగు చేశారు. ఆయకట్టు పరిధిలో వందలాది మంది రైతులు పొలాల్లో నాట్లు, కరిగట్లు, వరాలు చెక్కడం, దమ్ము చేయడం, నారు తీయడం, వెదజల్లడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. పాలేరు పాత కాల్వ కింద, భక్త రామదాసు ఎత్తిపోతల కింద గల ఆయకట్టుకు యాసంగికి నీటిని విడుదల చేశారు. రెండు, మూడు రోజుల్లో యాసంగి నీటి విడుదల వారబంధీ షెడ్యూల్ ఖరారు చేస్తామని ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వరరావు తెలిపారు.

# లోపల మరమ్మతులు.. బయట అధ్యాపకులు..

## 'డైట్'లో చెట్ల కిందనే అధ్యాపకులు



ఆవరణలో చెట్ల కింద కూర్చున్న ఫ్యాకల్టీ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 19: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్).. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కొత్త కష్టాలు వచ్చాయి. నూతన భవన నిర్మాణంతోపాటు ప్రస్తుత భవనంలో మరమ్మతులు, ఎలక్ట్రికల్, ప్రహరీ నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో తొలుత ప్రస్తుత భవన మరమ్మతు పనులు ప్రారంభించారు. దీంతో కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ తోపాటు గెస్ట్ ఫ్యాకల్టీ మొత్తం చెట్ల కిందే ఉండి పాఠాలు బోధించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇతర సిబ్బంది లైబ్రరీలో విధులు నిర్వర్తిస్తున్నారు. మరమ్మతులు జరుగుతుండడంతో లోపల ఉండలేని పరిస్థితి ఉందని ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు.